క్లుప్తంగా

సిమెంట్ డ్రెయిన్‌లకు శంకుస్థాపన



పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని రెండు, 57 డివిజన్‌లకు సంబంధించి మణిపురం ఫ్లెటైవర్ నుంచి రిలయన్స్ మార్కెట్ వరకు రూ.1.98 కోట్లతో నిర్మించనున్న సిమెంట్ డ్రెయిన్‌లకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సిమెంట్ డ్రెయిన్‌ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని వీఈఈ ఏడో సెక్షన్ విజయవాడ రోడ్డులో మణిపురం ఫ్లెటైవర్ నుంచి రిలయన్స్ మార్కెట్ వరకు అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, రెండో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి, 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహానా, పార్టీ నేతలు సత్యనారాయణ, నూర్‌ఖాన్, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని ఆంజనేయపేటలోని వీరాంజనేయస్వామి దేవాలయం పునః నిర్మాణం, విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం సేవాసమితి చైర్మన్ బద్దిగం కోటిరెడ్డి, ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి, అయ్యప్పస్వామి, జంటనాగులు, ధ్వజ, శిఖర కలశాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా విశేష హోమాలు, పూజలను వేదమంత్రాల నడుమ రుత్విక్కులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం విశేషంగా పాల్గొన్న భక్తులతో మేళతాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. చైర్మన్ కోటి రెడ్డి మాట్లాడుతూ బుధవారం ఉదయం 10.55 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠలు జరుగుతాయని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పులగం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో నవజాత శిశు సంరక్షణ కేంద్రం అభివృద్ధి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య విభాగం, నవ జాత శిశు చికిత్స, సంరక్షణ కేంద్రాన్ని రూ.80 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం పిల్లల వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవ జాత శిశు సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతం 20 పడకలు ఉన్నాయని చెప్పారు. వీటికి అదనంగా మరో 20 పడకలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కొంతమంది బయోమెట్రిక్, ఎఫ్ ఆర్ ఎస్ కుడా సరిగా వేయడం లేదన్న విమర్శలు రాకుండా చూడాలని సివిల్ సర్జన్ ఆర్ఎంఓకు ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, పిడియాట్రిక్ వైద్యులు రమేష్, మోహన్ చంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

నెహ్రూనగర్: నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని జిల్లా సహాయ ఉపాధి కల్పనాధికారి కె.రమాదేవి పేర్కొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ)ఆధ్వర్యంలో బ్రాడిపేటలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువతి, యువకుల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వస్తున్నామని ఆయా జిల్లాలలో ప్రాంతాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతి, యువకులలో నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన కాలేజీల్లో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా వివిధ రకాల కోర్సులు చదివే విద్యార్థులతో పాటు నిరుద్యోగులు ఈ కోర్సులను నేర్చుకుని ఉపాధి పొందే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో హిందూ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ చుక్కా నవీన్‌కుమార్, వ్యాపారవేత్త రాజేష్ పిళ్ళా, సదస్సు సమన్వయకర్త వి భగవాన్ దాస్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్‌ని జయంతి పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం స్థానిక చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయని బి. విజయలక్ష్మి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయిని జుబేదా బేగం వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవి శేఖర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రులు బార్ల తెరిచారు..

- జోరుగా మద్యం అమ్మకాలు
- ఎక్సైజ్, పోలీసు అధికారుల సహకారం
- నెలవారీ మామూళ్ల (యారక్)మత్తులో జోగుతున్న వైనం



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న బార్ వద్ద గొడువ పడుతున్న యువకులు

పట్నంబజారు: బార్లలో మద్యం ఇష్టారాజ్యంగా అమ్ముతున్నారు. నిబంధనలకు నీళ్లొదిలేశారు. మద్యం ప్రియులు నగరంలో అర్ధరాత్రి హల్‌చల్ చేస్తున్నారు. బార్ల సమీపంలో ప్రజలు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. అధికారులు కాసుల మత్తులో పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు ఉదయం 11గంటలకు తెరిచి రాత్రి 10గంటలకు వరకు మాత్రమే అమ్మకాలు జరుపుతున్నారు. ఈ నిబంధనలను ఆసరాగా చేసుకున్న కొంత బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు కాసుల కోసం అర్ధరాత్రులు కూడా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో కొంత మంది అర్ధరాత్రి అమ్మకాలపై 1902(జగనన్నకు చెబుదాం)కు ఫిర్యాదు చేశారు.

అడ్డూఅదుపు లేదు..

నగరంలో ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు అడ్డూఅదుపు లేకుండా నిర్వహిస్తున్నారు. కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో అధికంగా బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఒక బార్ వద్ద సుమారు 20 మంది మద్యం కోసం హడావుడి చేశారు. బార్ యాజమాన్యం కూడా ఃనూ మోడ్రన్‌ః రాత్రి 11 గంటలు దాటాక సెల్లార్ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఈ బార్‌పై 2020 కరోనా సమయంలో బార్ తెరిచి ఉంచారని కేసు కూడా నమోదు చేశారు. ఓల్డ్ క్లబ్ రోడ్డు చివరన ఉన్న ఒక బార్ 'కాలచక్రా'నికి అతీతంగా 24 గంటలు మందుబాబులకు సేవలందిస్తున్నారు. ఒక సందులోకి నుంచి వెళ్లిన తరువాత.. బార్ ఉన్న పెద్ద గేటుకే.. చిన్న గేటును ఫిక్స్ చేసి అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది కాలం క్రితమే ఉదయం 7గంటల సమయంలో మద్యం అమ్ముతున్నారని ఈ బార్‌లో పనిచేసే వ్యక్తిపై కేసు నమోదు అయింది. బార్ నిర్వాహకులే నేరుగా బార్ తెరిపించి విక్రయాలు చేయిస్తున్నప్పటికీ కేవలం అందులో పనిచేసే కార్మికుడిపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ బార్‌పైనే 1902కు ఫిర్యాదు అందినట్లు సమాచారం. అదే ప్రాంతంలో స్వాతి ముత్యంలా మరో బార్ రెస్టారెంట్ యజమానులు గుట్టు చప్పుడు కాకుండా సైడు డోర్ ద్వారా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. మణిపురం ఓవర్‌బ్రిడ్జి కింద కూడా ఒక బార్ పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఉదయం వేళలో పనులకు వెళ్లే కార్మికుల 6గంటల నుంచే మద్యం అందుబాటులో ఉంటుందో అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

యారక్‌ల మోజులో పడి...

నిబంధనలను విస్మరించి వేళలు లేకుండా ఆయా బార్ అండ్ రెస్టారెంట్‌ల్లో మద్యం విక్రయాలు జరపుతున్నారని తెలిసినప్పటికీ ఎక్సైజ్, పోలీసు అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ఓల్డ్ క్లబ్ రోడ్డు మూలన ఉన్న బార్ పక్క సందులో యథేచ్ఛగా యువకులు రోడ్డుపై మద్యం తాగి, బ్లేడ్ బ్యాచ్, బహిరంగ వ్యభిచారం చేసే వారికి అడ్డాగా మార్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారిని కొట్టి డబ్బులు తీసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఎక్సైజ్, పోలీసులకు నెలవారీ మామూలు(యారక్)గా పిలవబడే కవర్లు అందుతుండటంతో కనీసం పట్టించుకునే వాడే లేకుండాపోయారు.

కేసులు సరే.. నిలువరించేదెలా...?

బహిరంగ మద్యం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎంతో తలనొప్పిగా మారింది. మహిళలు, విద్యార్థినులు, యువతులు రోడ్డుపై వెళుతున్నప్పుడు కూడా కనీస గౌరవ ఇవ్వకుండా మద్యం తాగే పరిస్థితులు ఉన్నాయి. పొన్నూరు రోడ్డు చివరన ఉన్న ఒక బార్ పరిస్థితి అయితే ఇక చెప్పనవసరం లేదు. నేరుగా రోడ్డుపై ఉన్న డివైడర్లు, సైడ్ డ్రైన్‌లు, ఖాళీ స్థలాల్లో మద్యం తాగుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా... ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బార్ యాజమాన్యాలు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రాత్రి 11 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మకాలు చేపట్టాలి. తరువాత ఒక గంట కేవలం ఆహార పదార్థాలు తీసుకునేందుకు మాత్రమే ఆ సమయాన్ని వినియోగించుకోవాలి. ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తాం. బార్ సమయ వేళలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తాం.

– కె.వెంకట్రామిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

అర్ధరాత్రి అమ్మకాలు నిలువరిస్తాం

అర్ధరాత్రి వేళ మద్యం అమ్మకాలు లేకుండా చూస్తాం. కచ్చితంగా మఫ్టీ పార్టీలను రంగంలోకి దించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అర్ధరాత్రి వేళల్లో మద్యం తాగి వివాదాలు, ఘర్షణలు, ఇతరులపై దాడి చేయటం వంటి జరిగితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– నిచికేత్ షలేకే, ఏఎస్పీ గుంటూరు ఈస్ట్

పైపులైన్ లీకు...



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంకులకు తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌పై (సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైప్‌లైన్ లీక్ కావడంతో తాగునీరు వృథాగా కాలువల్లోకి పోయింది. గత మే నెలలోనే ఈ పైపులైన్‌పై ఇంజినీరింగ్ అధికారులు కొన్ని లక్షలు వెచ్చించి లీకులకు మరమ్మతులు చేశారు. తిరిగి మూడు నెలల్లోనే లీకులు ఏర్పడంతో స్థానికులు ఇంజినీరింగ్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్.ఎల్.ఆర్.కు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌పై సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద లీకుల నేపథ్యంలో గురువారం మరమ్మతులు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం సరఫరా అనంతరం మరమ్మతులు చేయడానికి సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు అంతరాయం కలుగుతుందన్నారు. శనివారం సాయంత్రం నుంచి సరఫరా యథావిధిగా ఉంటుందని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని లక్ష్మీపురం, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డు, కోర్టు కాంపౌండ్, కేవీపీ కాలని, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎక్కడైనా తాగునీరు అవసరమైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103, 104 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



షాలోమ్ ఇంగ్లీష్ పాఠశాలలో..



జైన్ హై స్కూల్ విద్యార్థులకు బహుమతులు..



ప్రజ్ఞ పాఠశాలలో..

నగరంపాలెం: నగరంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతమ్మకాలనీలోని షాలోమ్ ఇంగ్లీష్ పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. విజేతలను స్కూల్ డైరెక్టర్ లీలాబోస్, ప్రిన్సిపాల్ శారదా అభినందించారు.

విద్యార్థినికి అభినందనలు..

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో అభ్యుదయ మహిళ జూనియర్ కళాశాల విద్యార్థిని బి.భారతి రెండు బంగారు పతకాలు అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ అవార్డు పొందిన భారతిని డైరెక్టర్ బీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆర్.దేవి సత్కరించారు.

ప్రజ్ఞ పాఠశాలలో..

నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణ విద్యా వ్యవస్థపై ఉందని పాఠశాల కార్యదర్శి నాయుడు చక్రనాగ్ అన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎం.బ్రహ్మనాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌ఆర్ బీఈడీ కళాశాలలో..

ఆర్‌వీఆర్‌ఆర్ బీఈడీ కళాశాలలోనూ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జైన్ హై స్కూల్‌లో..

అమ్మను పూజించడం, అమ్మభాషను గౌరవించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని జైన్ హై స్కూల్ డైరెక్టర్ మొహమ్మద్‌మున్ను అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పాల్గొన్నారు.

తెలుగు భాషకు పట్టం కట్టిన కవులు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాష గొప్పతనాన్ని తెలుగు కవులతో పాటు ఇతర భాషల కవులు వేనోళ్ల పొగిడారని విశ్రాంత ఆచార్యులు డాక్టర్ గోనుగుంట్ల వైదేహి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

శతాబ్ద కాలం క్రితం తెలుగు భాషను వ్యవహారిక చేసిన ఘనాపాటి గిడుగు వెంకట రామమూర్తి అని తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శైలజ సభకు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కవి అబ్దుల్ రజా హుసేన్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ వాసిరెడ్డి భవాని పాల్గొన్నారు.

పాటిబండ్ల స్కూల్లో..

లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ల మంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు సూర్యదేవర హనుమంతరావు, పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు పర్యవేక్షణలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులందరికీ పద్య పఠన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

అలరించిన తెలుగు పాట



లక్ష్మీపురం: అవగాహన సంస్థ.. మనమూ పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన తెలుగు పాట కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రచయిత్రి ఏవీకే సుజాత.. కమ్మనైనా తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. కవులు, రచయితలు తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, సామాన్యుడికి చేరువ చేసిన గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలుగు భాషపై కవితలను జమదగ్ని, వీవీ రామ్, మురళీకృష్ణ ఆలపించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న అభ్యుదయ మహిళా కళాశాల డైరెక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న తోటకూర ప్రసాద్

తెలుగుభాషా దినోత్సవం

గుంటూరు మెడికల్: దేశ భాషలందు తెలుగు లెస్స అనే గొప్ప చరిత్ర లిఖించుకుందని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జి శివ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మామిడి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: పర్యావరణాన్ని కాపాడుకునేందు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పిలుపునిచ్చారు. జగనన్న హరితహారంలో భాగంగా మంగళవారం జేకేసీ కళాశాల రోడ్డు, ఐదో వీధిలో మామిడి మొక్కలను ఆయన నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛమైన పర్యావరణాన్ని రానున్న తరాలకు యథావిధిగా అందిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా శేషిరెడ్డి, అధ్యక్షుడు నల్లమేకల సాంబశివరావు, జేసీఎస్ క్లస్టర్-4 ఇన్‌చార్జి ఉడతా కృష్ణ, నాయకులు చన్ను మల్లు శ్రీహరిరావు, ఆంజనేయులు, ఒంటెద్దు శ్రీనివాసరెడ్డి, పుల్సు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఫారం-7, వ్యక్తిగత ఆధారాలు, సూపర్వైజరీ అధికారులు నేరుగా పరిశీలన చేసిన తర్వాతనే ఓటు తొలగింపు చేపట్టాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. పొన్నూరు రోడ్, అలీ నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో ఓటరు సర్వేను పరిశీలించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నగరంలో ఇంటింటి ఓటరు సర్వే పూర్తి అయిందన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చనిపోయిన ఓటర్ల తొలగింపు, బదిలీ ఓట్లు, ద్వంద ఓట్లు తొలగింపు, నూతన ఓటర్ల నమోదు వివరాలను బీఎల్‌ఓలు క్షేత్రస్థాయి పరిశీలించి, అర్జీలు తీసుకున్న తర్వాత సూపర్వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసి సిఫార్స్ చేయాలని ఆదేశించారు. తొలగించిన ఓట్లకు ఫారం-7 తీసుకోవాలని, చనిపోయిన వారికి సంబంధించి డెత్ సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. డూప్లికేట్ ఓట్లను వారి అనుమతితోనే ఒక చోట ఉంచి, మరో చోట తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్(ఏఈఆర్‌ఓ) ప్రదీప్ కుమార్, సూపర్వైజరీ అధికారులు అయేషా వలి, బాలాజీ బాషా, ఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి బిల్డింగ్‌కు పన్ను విధిగా ఉండాలి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో ఎక్కడా అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌లు ఉండటానికి వీలు లేదని, వార్డు సచివాలయం వారిగా అడ్మిన్ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు పూర్తి బాధ్యత వహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ చాంబర్ లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు తమ పరిధిలో ఏ ఒక్క నిర్మాణానికి పన్ను లేకుండా లేదా ఉండాల్సిన దానికన్నా తక్కువ ఉందా అని పరిశీలించి ఆర్‌ఐ ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. నూతన అపార్ట్‌మెంట్స్‌లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసిన నెల రోజుల్లో ఆస్తి పన్ను విధించాలని ఆదేశించారు. ఆశీలు వసూలుపై సమీక్షించి, గత ఏడాదితో పోలిస్తే డిపార్ట్‌మెంట్ వసూలు చేసినా ఈ ఏడాది తక్కువ వసూళ్లు జరగడం గమనించి, రెవెన్యూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆశీలు గత ఏడాది కన్నా తగ్గడానికి వీలు లేదని, ఆర్.ఓ.లు, డెప్యూటీ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆశీలు టెండర్ పొంది, బకాయిలు చెల్లించని వారి నుంచి వసూలుకు చట్టపరంగా యాక్షన్ ప్లాన్‌ని డెప్యూటీ కమిషనర్లు సిద్ధం చేయాలని కోరారు. నగరపాలక సంస్థకు సంబంధించిన షాప్స్ రెన్యువల్, 25 ఏళ్ల గడువు ముగిసిన వాటికి ఆక్షన్ పెట్టాలన్నారు. నగరంలో ప్రధాన రహదారుల వెంబడి అనేక భవనాలు రెసిడెన్షియల్ పన్ను ఉండి, కమర్షియల్‌గా వ్యాపార సంస్థలకు అద్దెలకు ఇస్తున్నారని, సదరు భవనాలను పరిశీలించి కమర్షియల్ ట్యాక్స్ విధించాలని, డీ అండ్ ఓ ట్రేడ్ ఉన్న అన్నింటికి కమర్షియల్ ట్యాక్స్ విధించాలని ఆదేశించారు. కమర్షియల్ ట్యాక్స్ విధించిన వాటికి వాటర్ ట్యాప్ మీటర్లు బిగించాలని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు కార్యదర్శులు, అధికారులు వ్యవహరించాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ .శ్రీనివాస్, డి.రవీంద్ర, ఆర్.ఓ.లు బాలాజీ బాష, రవికుమార్, సాంబశివరావు, రెహమాన్, మేనేజర్ శివన్నారాయణ, రెవెన్యూ విభాగ సూపరిండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం



కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం అవుట్ సోర్సింగ్ కార్మికులు, యూనియన్ నాయకులు మేయర్‌ను సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ నగర పాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారి కుటుంబంలోని వారికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇవ్వడంతో పాటు 60 సంవత్సరాలు దాటి రిటైర్మెంట్ అయిన వారి కుటుంబంలోని వారికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అయిన తరువాత అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 1వ తేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణకై ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు అడిగిన వాటిలో తమ పరిధిలోని ప్రతి సమస్యను పరిష్కరించుట జరుగుతుందని, మిగిలిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సంప్రదించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ర్యాలీ

పాత గుంటూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ బృందావన్ గార్డెన్స్ స్టేడియం నుంచి మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. యోగా గురువు కాలిశెట్టి కోటేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ శాంతి సమాజ స్థాపనే మానవత ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణ రెడ్డి, మానవత అధ్యక్షులు పి.విమల కుమారి, సహాయ కార్యదర్శి లక్ష్మీ సామ్రాజ్యం, కోశాధికారి సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

నెహ్రూనగర్: విద్యార్థుల్లో సజనాత్మకత, దేశభక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని హిందూ కళాశాల యాజమాన్య ప్రధాన కార్యదర్శి కుటుంబరావు కోరారు. హిందూ కళాశాల, హిందూ స్కూల్ యాజమాన్యాల ఆధ్వర్యములో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలకు దేశ స్వాతంత్ర్యము వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో దేశభక్తి, సామాజిక స్పహ సమరయోధుల, ఆదర్శజీవుల, వివిధ రంగాలలోని ప్రముఖుల వేష ధారణ పోటీలు అరండల్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలానంద కేంద్రం కార్యదర్శి నడింపల్లి గురుదత్తు, స్కూల్ కార్యదర్శి రామకృష్ణ పరమహంస, స్కూల్ ప్రిన్సిపాల్ సౌజన్య ఉపాధ్యాయులు సుచిత్ర, సువర్చలా, నాగలక్ష్మి, కల్యాణి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే లాడ్జిల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అన్వర్ బాషా హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని లాడ్జి యజమానులు, మేనేజర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. లాడ్జిల్లో వ్యభిచారం, మద్యపానం, పేకాట వంటివి జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని వారికి స్పష్టం చేశారు. రూమ్ కోసం వచ్చే వారి ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని తెలిపారు. వాటిని నిత్యం స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ చెప్పారు. విద్యార్థులు, మైనర్‌లకు సరైన కారణం లేకుండా గదులు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే ఈ నెల 28న రాజాగారితోటలోని ఓ లాడ్జిలో లాడ్జి నిర్వాహకుడు గాజుపల్లి వెంకటరెడ్డి, రూమ్ బాయ్ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని, అరెస్టు చేసినట్లు గుర్తుచేశారు. సమావేశంలో షేక్ ఎండీ మీరజ్ తదితరులు పాల్గొన్నారు.